కె. బాలగోపాల్


# అభివృద్ధే అయితే అబద్ధాలేల?

కోస్టల్ కారిడార్ అంటే విశాలమైన రోడ్లు మాత్రమేనని, రోడ్లకోసమే తప్ప వేరే దేని కోసమూ భూసేకరణ చేయలేదని ముఖ్యమంత్రి అనడం అవాస్తవం. తాము నమ్ముతున్న అభివృద్ధి విధానం ఏమిటో పాలకులు నిర్మొగమాటంగా చెప్పేస్తే, తాము ఏమి నమ్మేదీ ప్రజలు నిర్ణయించుకోగలరు. తమ విశ్వాసాల మీద తమకే నమ్మకం లేని ఈ దోబూచులాట ఎందుకు?

కోస్టల్ కారిడార్ గురించి రాష్ట్ర ప్రభుత్వం, దాని తరఫున వకాల్తా పుచ్చుకున్న వారు, పదే పదే అబద్ధాలెందుకు చెప్తున్నారో అర్థం కాదు. తాము చేస్తున్నది ఘనకార్యం అని నమ్మేటప్పుడు నిజాయితీగా ఒప్పుకొని సమర్థించుకునే ప్రయత్నం చేయడం ఉచితంగా ఉండదా? మనిషికైనా ప్రభుత్వానికైనా ఆత్మ విశ్వాసమే అందం. చేస్తున్నది, చేయడానికి పూనుకున్నది చేయడం లేదనీ అంతా ఎవరో పుట్టిస్తున్న తప్పుడు ప్రచారమనీ దబాయించడం ఆత్మ గౌరవం ఉన్నవారెవరూ చేయదగ్గ పనికాదు. నిజానికి కాంగ్రెస్ వారికి అర్థం కావడం లేదేమోగానీ, గుట్టు మొత్తం చెప్పేసి మీలో ఎవరు విభేదిస్తున్నారో ముందుకు రండి అని సవాలు చేస్తే ఇవాళ ధర్నాలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలన్నిటికీ ఇబ్బందే. కోస్టల్ కారిడార్ అనే నిర్దిష్టమైన పథకాన్ని వ్యతిరేకించడం ఎన్నికల సీజన్‌లో ఉచితం అని వారు భావించి ఉండవచ్చును గానీ, దాని వెనక ఉన్న మౌలికమైన అభివృద్ధి విధాన దృక్పథంతో ఇవాళ దేశాన్ని ఏలుతున్న, ఏల జూసే ఏ పార్టీకీ అభిప్రాయభేదం లేదు. భారతదేశపు సామాజిక, ఆర్థిక పరిస్థితులలో ఏ రకమైన అభివృద్ధి విధానం ఉచితంగా ఉంటుందన్న చర్చను కాంగ్రెస్–ప్రతిపక్షాల కొట్లాటగా అధికారం కోసం తగవులాడుకుంటున్న సకల రాజకీయ పక్షాలూ చిత్రించడంలో సఫలం అయ్యాయి. దీనికి మీడియా సహకారం పుష్కలంగా ఉంది. సామాజిక జ్ఞానం యావత్తు మీడియాలో దర్శనమిచ్చే రాజకీయ పక్షాల సంవాదం నుంచి పొందే స్థితికి నెట్టి సగటు పౌరులను అందరూ కలిసి తీవ్ర బుద్ధి మాంద్యంలో ఉంచారు.

కోస్టల్ కారిడార్‌కు పునాది అయిన ఆలోచనారీతి ప్రపంచ బ్యాంకు దాదాపు దశాబ్దం కింద మనబోటి సమాజాలకు ఉచితం అని సూచించిన విధాన దృక్పథంలోనే ఉంది. అభివృద్ధి అనేది వేగంగా జరగాలంటే వ్యవసాయ ప్రధాన సమాజాలుగా ఉన్నవి పారిశ్రామికీకరణ భారీగా చేపట్టాలి. అది కూడ ఎగుమతి ప్రధానమైనదిగా ఉండాలి. దానికోసం పెట్టుబడులను పెద్దెత్తున పెట్టాలి. ఉత్పత్తిలో, వర్తకంలో పెట్టుబడి ప్రైవేట్ రంగంలోనే ఉండాలి గానీ దానికి అవసరమైన పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వ – ప్రైవేట్ రంగాలకు ఉచిత స్థానం ఉండాలి. గతంలో ఈ మౌలిక వసతులను (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పొందుపరచడం పైన ప్రత్యేక దృష్టి ఉండేది కాదు. ఇప్పుడదే ఒక పెద్ద కార్యక్రమంగా చేపట్టాలి. అప్పుడే పెట్టుబడులు భారీగా సమకూరుతాయి. ఈ విధానంలో ప్రైవేట్ పెట్టుబడుల కోసం భిన్న దేశాలూ రాష్ట్రాలూ పోటీపడబోతాయి కాబట్టి వారికి అనుకూలమైన రాయితీలు దండిగా కల్పించాలి. సకల భౌతిక, ఆర్థిక వనరుల వినియోగానికీ కేటాయింపుకూ ఈ దృష్టే ప్రాతిపదిక కావాలి. సెజ్‌లూ పారిశ్రామిక కారిడార్‌లూ ఈ విధాన నీతిలో భాగంగా పుట్టినవే.

రాజకీయ పార్టీలన్నిటికీ ఈ విధాన నీతి నచ్చడానికి కేవలం ఇందులోని విజ్ఞత కారణం కాదు. అన్ని ప్రత్యామ్నాయ అభివృద్ధి పంథాల కంటే ఇది ఆయా సమాజాలలో నిర్ణాయక స్థానాలలో ఉన్నవారికి ఆస్తులు పోగుచేసుకోవడానికి ఎక్కువ అవకాశం ఇస్తుంది. రాజకీయాలను ఆస్తుల సంపాదనకొక సాధనంగా మలచడంలో అందరికీ మార్గదర్శకులయిన కాంగ్రెస్ వారు ఈ విధాన నీతిని ఆకలిగా అమలు చేస్తుండడంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు గానీ పాలక స్థాయిని చేరుకున్న ఏ పార్టీకీ దీనితో మౌలిక విభేదం లేదు. మీడియా అత్యంత అనుకూలంగా ఉండడం వల్ల చంద్రబాబు కుప్పిగంతులు సునాయాసంగా సాగిపోతున్నాయి గానీ ప్రపంచ బ్యాంకు సలహాలను మొట్టమొదట ఆచరించడం మొదలు పెట్టింది అతని ప్రభుత్వమే. అది తప్పని అతనిప్పటికీ అనలేదు, అనబోడు.



రాజకీయ పార్టీల వైఖరులు అటుంచి, ఈ విధాననీతిలోని విజ్ఞత ఎంత? జీవావరణానికీ, పర్యావరణానికీ దీనివల్ల కలగగల హానిని కూడ కొంచెం సేపు పక్కన పెడితే, రెండు సందర్భాలలో మాత్రమే ఇది తెలివైన ఆలోచన కాగలదు. పారిశ్రామికీకరణ కోసం ఎవరి జీవికకూ ఆధారం కాని ప్రకృతి వనరులను – ప్రత్యేకించి భూమిని – పెద్దెత్తున కేటాయించే అవకాశం ఉన్నా, లేక ఆ కేటాయింపు వల్ల జీవనం కోల్పోయే వారికి అదే పారిశ్రామికీకరణలో మెరుగయిన, మరింత భద్రమైన, జీవనం కల్పించే అవకాశం ఉన్నా, ఇది ఆచరణ యోగ్యమైన విధానమే అయి ఉండవచ్చు. మన దగ్గర ఈ రెండు పరిస్థితులూ లేవు. 'ఊరికే పడి ఉన్న' ప్రకృతి వనరులు మన దగ్గర లేవు. ప్రకృతిలో ప్రతీ అంగుళం నుంచి జీవనం పొందేవారెవరో ఒకరు ఉన్నారు. ఒకరంటే ఒకరిద్దరు కాదు, ఒక ప్రజా సమూహం, ప్రత్యేకించి ఒక అణగారిన కులం, ఒక నోరులేని ఆదివాసీ తెగ. రెండవది, ఇప్పుడు మనం ఆహ్వానిస్తున్న పెట్టుబడి విస్తారంగా పనులు కల్పించేది కాదు. ప్రత్యక్షంగానే కాదు, పరోక్షంగా సహితం అది కల్పించే ఉపాధి స్వల్పమే, అందులోనూ ఆధునిక సాంకేతిక ప్రక్రియలలో నేర్పున్న వారికే.

పాశ్చాత్య దేశాలలో ఈ అభివృద్ధి సాధ్యం కాలేదా, ఆ దేశాలు ఇప్పుడు ప్రజలందరికీ సాపేక్షంగా ఉన్నతమైన జీవన ప్రమాణాలు అందివ్వడం లేదా అంటారేమో. పాశ్చాత్య దేశాల అధికారిక చరిత్రలో పారిశ్రామికీకరణ సుందరమైన విప్లవంగానే దర్శనమిస్తుందిగానీ అప్పటి సామాజిక సంవాదాన్ని చూస్తే అదెంత హింసాత్మకంగా సాగిందో తెలుస్తుంది. ఆయా దేశాలలోనే కాదు, వాటి వలసలలోను అది చాలా హింసకు కారణమయింది. హక్కుల గురించి అవగాహన లేని రోజులలో జరిగిపోయిన చరిత్రను పునరావృతం చేయ నక్కర లేదు. అంతేకాక అప్పటికీ ఇప్పటికీ పైన పేర్కొన్న రెండు విషయాలలో ఒక దాంట్లో తేడా ఉంది. అప్పటి పారిశ్రామికీకరణ ఉపాధి ప్రధానమైనది. ఇప్పటిలాగ యంత్ర ప్రధానమైనది కాదు.

కాగా జీవావరణాన్ని పర్యావరణాన్ని కూడా లెక్కలోకి తీసుకున్నట్టయితే ఆ అభివృద్ధి పంథా అసలే వద్దనవలసి వస్తుంది. పిడికెడు దేశాలు ప్రపంచంలోని సకల ఇంధన వనరులనూ గుప్పిట్లో పెట్టుకొని విపరీతమైన తలసరి ఇంధనం వాడకాన్ని ప్రమాణంగా గల ఆ అభివృద్ధి నమూనాను ఆచరించాయి. అది ఇక మీదట సాధ్యం కాదు. ఇప్పటికే అది మానవ మనుగడను వినాశనం అంచుకు తెచ్చిందని పర్యావరణవేత్తలు సోదాహరణంగా చెప్తున్నారు. కాబట్టి ఈ అభివృద్ధి నమూనానే తిరస్కరించి ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించవలసిన అవసరం ఉంది. ఈ చర్చ వల్ల, అది సూచించ గల ప్రత్యామ్నాయాల వల్ల దమ్మిడీ ఆదాయం రాదు కాబట్టి రాజకీయ నాయకులకు అందులో ఆసక్తి ఉండదు. అలవాటయిపోయిన బాటను విడిచిపెట్టి కొత్త ఆలోచనలు చేయడం పాలనా యంత్రాంగానికి ఎప్పుడూ ఇష్టం ఉండదు కాబట్టి బ్యూరోక్రసీకి ఆసక్తి ఉండదు. ఈ చర్చ నువ్వా నేనా అన్నట్టు వాడిగా వేడిగా సాగదు కాబట్టి మీడియాకూ ఆసక్తి ఉండదు. కాబట్టి వీరెవ్వరితో నిమిత్తం లేకుండ సమాజమే ఈ చర్చను చేపట్టాలి.

కోస్టల్ కారిడార్ గురించి పాలకుల దబాయింపుకు తిరిగి వద్దాం. కోస్టల్ కారిడార్ అంటే విశాలమైన రోడ్లు మాత్రమేననీ అందులో భూములను మింగే పరిశ్రమలూ కాలుష్యం కలిగించే పరిశ్రమలూ ఉన్నాయని ప్రతిపక్షాలు అనవసరంగా ప్రజలను రెచ్చగొడుతున్నాయని ఒకసారి, కోస్టల్ కారిడార్ పేరిట రోడ్ల కోసమే తప్ప వేరే దేనికోసమూ ప్రభుత్వం భూసేకరణ చేయలేదని ఒకసారి ముఖ్యమంత్రే స్వయంగా అన్నారు. ఇది అవాస్తవం. రద్దుచేశామని చెప్తున్న జి.వో. 34లో కోస్టల్ కారిడార్‌లో ఏమున్నాయో స్పష్టంగా ప్రభుత్వమే చెప్పింది. కోస్టల్‌కారిడార్ అనే ప్రాజెక్టులో 'రోడ్లు, రైల్వే లైన్లు, ఓడరేవులు, విమానయానం, నీటి సరఫరా, పెట్రోలియం సహజ వాయువుల సరఫరా, విద్యుత్ సరఫరా' వంటి మౌలిక పారిశ్రామిక వసతులు, 'పారిశ్రామికీకరణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, టూరిజం, క్రీడలు, ఐ.టి. సంస్థలు, టౌన్‌షిప్‌లు, విద్యా సముదాయాలు, వైద్య సముదాయాలు మొదలైనవి' ఉంటాయని జి.వో.34 చెపుతోంది. జి.వో. 34 రద్దయింది కదా అంటారేమో. జి వో 34 కోస్టల్ కారిడార్ అనే ప్రణాళికను ప్రకటించిన తాఖీదు కాదు. అట్లాగయితే దాని రద్దుతో ఇదీ రద్దయ్యేది. జి.వో. 34 కోస్టల్ కారిడార్ అనే పాలనాంశాన్ని 'మౌలిక వసతులు, పరిశ్రమల' శాఖకు కేటాయిస్తూ దాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టే బాధ్యతను ఇన్‌కాప్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) అనే సంస్థకు అప్పగించే జి.వో. ఈ సంస్థ ప్రైవేట్– ప్రభుత్వ భాగస్వామ్యం (పి.పి.పి) అనే విధాన విశేషానికొక ఉదాహరణ. దాని సలహామండలిలో అంతర్జాతీయ స్థాయి సలహాదారులు 50 మంది ఉన్నారట. భారీ సలహాలు తీసుకొని ఇన్‌కాప్ కోస్టల్ కారిడార్ కోసం మౌలిక వసతులను పి.పి.పి పద్ధతిలో ఎంపిక చేస్తుంది వాటి కోసం ప్రణాళిక తయారు చేస్తుంది, కోస్టల్ కారిడార్‌ను రూపొందించడంలో తన పాత్రేమిటో కూడ వివిధ ప్రభుత్వ శాఖలను సంప్రదించి నిర్ణయిస్తుంది. ఈ అధికారాలు ఇన్‌కాప్‌కు ఇచ్చే తాఖీదు జి.వో.34. ఇది రద్దయితే ఇన్‌కాప్‌కు కట్టబెట్టిన ఈ అధికారాలు రద్దయ్యాయి తప్ప వేరే ఏమీ కాలేదు. రేపెప్పుడయినా అవే అధికారాలు లేక బాధ్యతలు వేరొక సంస్థకు అప్పగించవచ్చు. ఉదాహరణకు విశాఖపట్నం– కాకినాడల మధ్య పెట్రోలియం ఆధారిత పరిశ్రమలు, రసాయన పరిశ్రమలు గల పారిశ్రామిక ప్రాంతాన్ని (పి.సి.పి.ఐ.ఆర్) రూపొందించే విషయంలో ఈ బాధ్యతలను పోలిన బాధ్యతలు నిర్వర్తించడానికి ఒక స్పెషల్ డెవలప్‌మెంట్ అథారిటీని జివో 373 ద్వారా నెలకొల్పారు. ఆ అథారిటీకి ఈ బాధ్యతలన్నీ సులభంగా అప్పగించవచ్చును.

ఇప్పటిదాకా జరిగిన భూ సేకరణ కేవలం రోడ్లకోసమేననేది కూడ అబద్ధం. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కోస్టల్ కారిడార్‌లో భాగమైన వాన్‌పిక్ కోసం భూ సేకరణ చాలా వరకు పూర్తిచేశారు. అందులో రోడ్లేకాక రెండు ఓడరేవులూ, ఒక థర్మల్ ప్లాంటు, ఒక నౌకా నిర్మాణ కేంద్రం ఉన్నాయి. నెల్లూరు జిల్లాలో, కృష్ణా జిల్లాలో, శ్రీకాకుళం జిల్లాలో కూడ ఈ తీర ప్రాంత పారిశ్రామికీకరణలో భాగంగా థర్మల్ కేంద్రాల కోసం భూసేకరణ చేపట్టారు. పూర్తి చేశారు. అన్ని కోస్తా జిల్లాలలోనూ ఓడరేవుల కోసం భూ సేకరణ చేస్తున్నారు.

తాము నమ్ముతున్న అభివృద్ధి విధానం ఏమిటో పాలకులు నిర్మొగమాటంగా చెప్పేస్తే, తాము ఏమి నమ్మేదీ ప్రజలు నిర్ణయించుకోగలరు. తమ విశ్వాసాల మీద తమకే నమ్మకం లేని ఈ దోబూచులాట ఎందుకు?